# చరిత్ర

## ఆర్య నాగరికత

ఆర్య నాగరికత ప్రాచీన భారతీయ నాగరికతలో రెండోది. తొలి ఇనుప యుగ నాగరికతగా పేరొందింది. ఇది క్రీ.పూ.1500 నుంచి క్రీ.పూ.600 వరకు కొనసాగింది. ఆర్యుల చరిత్రకు ఆధారం వేదాలు కాబట్టి వారి నాగరికతను వేద నాగరికత అని కూడా పేర్కొంటారు. ఆర్య నాగరికతను తొలి వేద నాగరికత, మలి వేద నాగరికతగా విభజించారు. భారతదేశంపైకి దండెత్తి వచ్చిన తొలి విదేశీయులుగా ఆర్యులను ప్రస్తావిస్తారు. ఆర్యుల జన్మస్థలంపై అనేక సిద్ధాంతాలున్నాయి. 'ఆర్య ద్రావిడ దంపతులకు జన్మించిన బిడ్డే హైందవ నాగరికత లేదా హిందూ మతం' అని రవీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నారు.

### వేద సాహిత్యం

ఆర్యుల చరిత్రకు ప్రధాన ఆధారం వేద సాహిత్యం. ఇందులో నాలుగు వేదాలు, నాలుగు ఉప వేదాలు, ఆరు వేదాంగాలు, 180 ఉపనిషత్తులు, అరణ్యకాలు, బ్రాహ్మణాలు ఉన్నాయి.

★ వేదాలు నాలుగు. 1) రుగ్వేదం 2) యజుర్వేదం 3) సామవేదం 4) అధర్వణ వేదం.

**రుగ్వేదం:** దీన్ని స్తోత్ర వేదంగా పేర్కొంటారు. రుగ్వేదాన్ని పది మండలాలుగా విభజించారు. ఇందులో 1028 శ్లోకాలున్నాయి. దేవతలను స్తుతిస్తూ ఉండే శ్లోకాలు/ పాటలనే రుక్కులు అంటారు. ఇంద్రుడిపై 250 శ్లోకాలు, అగ్ని దేవుడిపై 200 శ్లోకాలు ఉన్నాయి. పదో మండలంలో ఉన్న పురుష సూక్తంలో వర్ణ వ్యవస్థ గురించిన ప్రస్తావన కనిపిస్తుంది. ఇది ప్రాచీన వేదం. క్రీ.పూ.1500 నుంచి 1000 వరకు ఉన్న ఈ వేదకాలాన్నే రుగ్వేద సంస్కృతి లేదా తొలి వేద నాగరికత అని పేర్కొంటారు. రుగ్వేదంలో గాయత్రి మంత్రం, పెండ్లి శ్లోకం ఉన్నాయి.

**యజుర్వేదం:** యజ్ఞ యాగాల గురించి వివరించే వేదం. దీన్ని క్రతు సూత్రాల వేదం అని కూడా అంటారు. దీనిలో అధర్వు పౌరోహిత్య విధానాన్ని పేర్కొన్నారు. ప్రకృతిని వశపరచుకునే మంత్రాలు ఉన్నాయి. అతి ప్రాచీనమైన గద్య రచన ఈ వేదంలో కనిపిస్తుంది.

**సామవేదం:** శ్రావ్య వేదంగా పేర్కొనే సామవేదంలో సంగీత మూలాలు ఉన్నాయి. స్తోత్రాల గ్రంథంగా అభివర్ణిస్తారు. ఉద్గాత్రి పౌరోహిత్య విధానం ఇందులో ఉంది.

**అధర్వణవేదం:** భూత ప్రేతాలను, రోగాలను పారద్రోలే మంత్రాలు ఉన్న వేదం. వ్యవసాయం, వైద్య సంబంధిత మూలాలు ఈ వేదంలో ఉన్నాయి. దీన్ని ఆర్యేతరుల వేదంగా చరిత్రకారులు విశ్వసిస్తారు. గిరిజన జాతుల మూఢ నమ్మకాలను కూడా ఈ వేదం వివరిస్తుంది.

★ ఉపవేదాలు నాలుగు. 1) ఆయుర్వేదం 2) శిల్పవేదం 3) గాంధర్వవేదం 4) ధనుర్వేదం

★ వేదాంగాలు ఆరు. 1) శిక్ష (ధ్వనిశాస్త్రం) 2) ఛందస్సు 3) వ్యాకరణ 4) నిరుక్త 5) జ్యోతిష్య 6) కల్ప

**బ్రాహ్మణాలు:** యజ్ఞ యాగాది క్రతు విజ్ఞానాన్ని అందిస్తాయి. కర్మ మార్గాన్ని ప్రచారం చేస్తాయి. గణిత, ఖగోళశాస్త్రాల్లాంటి భారతీయ శాస్త్ర విజ్ఞానాలకు సంబంధించిన మూలాలు బ్రాహ్మణాల్లోనే ఉన్నాయి. బలి విధానాలను వివరిస్తాయి. ఐతరేయ బ్రాహ్మణం రుగ్వేదానికి అనుబంధమై ఉంది. రాజు ధర్మపాలన చేయాలని పేర్కొనేది శతపథ బ్రాహ్మణం.

**అరణ్యకాలు:** వీటికి శబ్దపరంగా అటవీ పుస్తకాలు అనే అర్థం వస్తుంది. ఇవి మార్మిక, యాగ ప్రతీక వాదాలతోపాటు పౌరోహిత్య తత్వాన్ని వివరిస్తాయి. బలి, కర్మల కంటే ధ్యాన పద్ధతులపై ఎక్కువగా దృష్టిని కేంద్రీకరిస్తాయి. బ్రాహ్మణాల కర్మ మార్గానికి, ఉపనిషత్తుల జ్ఞాన మార్గానికి మధ్యస్థంగా ఉన్నవే అరణ్యకాలు.

**ఉపనిషత్తులు:** ఇవి తాత్వికమైన గ్రంథాలు. జ్ఞాన మార్గానికి అధిక ప్రాధాన్యమిస్తాయి. ఉపనిషత్తులనే వేదాంతాలు అంటారు. భారతదేశంలోని అన్ని మతాల తాత్విక చింతనలు ఉపనిషత్తుల నుంచే ఆవిర్భవించాయి. భారతీయ ఆధ్యాత్మిక చింతన వీటిలోనే పరాకాష్ఠను పొందింది. స్వామి వివేకానంద ఉపనిషత్తుల బోధినలకు అధిక ప్రాధాన్యమిచ్చారు.

## తొలి వేదకాలం/ రుగ్వేద సంస్కృతి

## క్రీ.పూ. 1500 – 1000

★ ఆర్యుల జన్మస్థలం ఆర్కిటిక్ ప్రాంతమని బాలగంగాధర్ తిలక్ పేర్కొన్నారు.

★ మధ్య ఆసియా నుంచి వచ్చారని మాక్స్ ముల్లర్, ధ్రువ ప్రాంతవాసులని ఎ.సి. డార్న్ పేర్కొన్నారు.

★ తొలి వేద ఆర్యులు సప్త సింధు ప్రాంతంలో జీవించారు.

★ సింధు ప్రజలను వీరు దాస్యులుగా సంబోధించారు.

★ ఆర్యుల వలసలను తెలియజేసే విదేశీ ఆధారం భోగజ్‌కోయి శాసనం. ఇది ఇరాక్ ప్రాంతంలో (మధ్య ఆసియా – కవడోషియా) బయల్పడింది.

★ ఆర్య నాగరికత భారతదేశంలో తొలి ఇనుప యుగ నాగరికత. క్రీ.పూ.1500లో భారతదేశంలో తొలిసారిగా ఆర్యులే ఇనుమును ఉపయోగించారు.

★ కుటుంబ అధిపతిని గృహపతి అనేవారు. పితృస్వామిక కుటుంబ జీవన విధానం ఉండేది.

★ గ్రామాధిపతిని గ్రామణి అనేవారు.

★ రాజును రాజన్ అని, రాజ్యాన్ని జనపథం అని పిలిచేవారు. రాజుకు పరిపాలనలో సేనాని, పురోహిత అనే ఉద్యోగులు తోడ్పడేవారు. సభ, సమితి అనేవి రాజుకు పరిపాలనలో సహాయపడేవి.

★ తొలి వేదకాలంలో రాజు బలి, భాగ అనే పన్నులు వసూలు చేసేవాడు. బలి అంటే యజ్ఞ యాగాల సమయంలో వసూలు చేసే పన్ను.

★ భాగ అనేది తెగ సభ్యులు (ప్రజలు) చెల్లించే పన్ను.

★ రాజ్యాన్ని జనపదాలు – విస్‌లు – గ్రామాలుగా విభజించారు. సభ, సమితితో పాటు విడత, గణం అనే సభలు కూడా తొలి వేదకాలంలో ఉండేవి.

★ రుగ్వేద కాలంలో వ్రజపతి (పచ్చికబయళ్ల సంరక్షకుడు) అనే అధికారి ప్రస్తావన ఉంది.

★ దశరాజ్ఞ యుద్ధం గురించి రుగ్వేదం వివరిస్తుంది. రావి (పరుష్ని) నది ఒడ్డున ఈ యుద్ధం జరిగింది. భరత తెగకు చెందిన సుదాసుడు అనార్య తెగలను ఓడించాడు.

★ భరత, పురు తెగలు కలిసి కురు తెగగా మారారు.

★ తొలి వేదకాలంలో పశుపోషణ, వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉండేవి.

★ సంపదకు సూచిక గోవులు. పశు సంపద కోసమే యుద్ధాలు జరిగేవి.

★ తొలి వేదకాలంలో నిష్క అనే బంగారు నాణెం వాడుకలో ఉండేది. నాటి ఆర్యుల ప్రధాన దైవం ఇంద్రుడు.

★ తొలి వేదకాలంలో వర్ణ వ్యవస్థ లేదు. కానీ వర్ణ వ్యవస్థ గురించి వివరించే ఆధారం రుగ్వేదంలోని పురుష సూక్తంలో ఉంది.

★ చాతుర్వర్ణ వ్యవస్థ ఉండేది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగు వర్ణాలు ఉండేవి.

★ వృత్తుల ప్రాతిపదికన సైనికులు, పురోహితులు, సామాన్య ప్రజలు అనే మూడు వర్గాలను చరిత్రకారులు పేర్కొన్నారు.

★ రుగ్వేద కాలంలో స్త్రీ స్థానం ఎంతో ఉన్నతంగా ఉండేది. సాంఘిక దురాచారాలు అమల్లోలేవు. గార్గి, మైత్రేయి, లోపాముద్ర లాంటి స్త్రీ రచయితలు ప్రసిద్ధిగాంచారు. అపాల విశ్వవర, ఘోష లాంటి స్త్రీలు రుగ్వేదంలోని కొన్ని రుక్కులను సంతరించారు.

**రచయిత: బొత్స నాగరాజు**



www.eenadupratibha.net